# కాంట్రాక్టు

• మహర్షి •

ముద్దుల పెళ్ళాం ఇందుమతి ఉదయాన్నే ఎవరితోనో గయ్ గయ్ మని పోట్లాడుతుంటే నిద్రాభంగమైన రంగారావు గబుక్కున లేచి కూర్చుని బద్ధకంగా రెండు ముక్కలు ముక్కి జారిపోతున్న లుంగీని ఎగలాక్కుని హాల్లోకొచ్చాడు.

"దొంగముండ నీకెప్పుడు బడితే అప్పుడు అడిగినంత ఇవ్వటానికి మా దగ్గిర బ్యాంకులున్నాయను కున్నావా? పైసా కూడా ఇవ్వను చేస్తే చెయ్ లేకపోతే లేదు". పని మనిషిని విసుక్కుంటున్నది ఇందుమతి.

"ఇందూ! ఉదయాన్నే సుప్రభాతం ఏమిటే? కాస్తకాఫీ ఇవ్వకూడదటోయ్!" ప్రేమగా అడిగాడు రంగారావు.

"ఇస్తాను ఇస్తాను. ఇందూ అంటూ నన్ను మతి లేని దానిలా చేస్తున్నారు. కాఫీ కాదు కషాయం ఇస్తాను దమ్మిడి సంపాదన లేదు. కానీ కమ్మని కాఫీ మాత్రం కావాలి" రుసరుసలాడి బుసబుస పొంగింది ఇందుమతి.


"ఈ అకాల అలకకు కారణమేమిటే ఇందూ! పట్టు చీర కావాలా లేక పుట్టింటికి వెళ్ళాలా?" తలపట్టుకుని సోఫాలో కూలబడ్డాడు రంగారావు.

"అలకాలేదు ఆవకాయి జాడీ లేదు. ఆ దేవుడు తప్పుడు రాతలు రాశాడు. కనీసం అడగగానే వేసి పెట్టే మొగుడినిచ్చినా బాగుండేది" పైట చెంగుతీసి గబగబా కళ్ళు వత్తుకుని ముక్కు బర్రుమని చీదింది.

"నువ్వు ఎంత కళ్ళు వత్తుకున్నా నీళ్ళు రావడం లేదు కానీ నీ అలకకు కారణం చెప్పుదేవి?" బతిమాలాడు రంగారావు.

"అలకా లేదు గిలకాలేదు ప్రక్కింటి సాహిరావు ఎదురింటి వెంకట్రావు భార్యల్ని ఎంచక్కా చూసుకుంటున్నారో చూడండి. వాళ్ళు ఏది కావాలంటే అది వచ్చి వాకిట్లో వాలుతుంది" అన్నది ఇందుమతి గిరగిర తిప్పుతూ.

"సాహిరావు లాయరు, వెంకట్రావు డాక్టరు. ఇద్దరికీ చేతినిండా ప్రాక్టీస్ వుంది సంపాదిస్తున్నారు. అయితే నన్నేం చేయమంటావ్?" కొంచెం కోపంగా అన్నాడు రంగారావు.




"మీరేం చేస్తారు? ఇదంతా నా ఖర్మ అనుకుని ఏడుస్తున్నాను. ఆనాడు గొప్ప గొప్ప లాయరు సంబంధాలొస్తే ఎప్పుడు కోర్టు తిరుగుతారు, డాక్టరు సంబంధాలొస్తే ఎప్పుడు పేషెంట్లు అంటూ తిరుగుతారు ఆడాళ్ళను అసలు పట్టించుకోరు అని మా వేలు విడిచిన మేనమామ చిన్న కూతురి మొగుడి చెల్లెలి తూరిది పెళ్ళాం ఆడపడచు కూతురు చెబితే విని నిజమేననుకుని మిమ్మల్ని కట్టుకుంటే కొంగుపట్టుకు తిరుగుతారని ఆశపడి ఇంజనీర్ మొగుడిని ఎగిరెగిరిపడినందుకు నాకు తగిన శాస్తి జరిగింది" అని ఎంత ప్రయత్నించినా ముక్కు, కళ్ళు సనివేయలేదు.

"అలా ఫ్లాష్ బ్యాక్‌లో కెళ్ళి నన్నెందుకిలా నంజుకుతింటావు ఇందూ! ఇప్పుడు నన్నేం. చేయమంటావ్" బుజ్జగించే ప్రయత్నంలో విపరీతమైన ఛీత్కారాలకు గురై కాఫీ లేకుండానే ఆఫీసుకు బయలుదేరాడు.

★ ★ ★ ★ ★

కాంట్రాక్టర్ కనకారావు వంగి వంగి మెల్లగా నడుస్తూ చంకలోని బ్యాగుని సరిచేసుకుంటూ లోపలికి అడుగు పెట్టాడు.

"ఏంటి కనకారావుగారూ! అడ్డమైన గడ్డి తింటున్నారని ఎవరైనా వడ్డి విరగ్గొట్టారా లేక చిన్న అర్ధరాత్రి హఠాత్తుగా గూని గట్లా వచ్చిందా?" కిళ్ళీలు నమిలి నమిలి భయంకరమైన గార పట్టిన పళ్ళను బయటకు పెట్టి పడిపడి మరీ నవ్వాడు ఆఫీస్ అటెండరు.

"ముయ్ . ముయ్ . ముందా నోరు ముయ్యిరా బాబు! నీ గారపట్టి కొరుక్కుపోయిన పళ్ళను చూస్తుంటే నా కడుపులో వేయి పెట్టి కెలుకుతున్న ఫీలింగ్ కలుగుతోంది" బతిమాలాడు కనకారావు.

వాడు మాయలు ఫకీరు రహస్యం తెలిసిన వాడిలా ఫోజు పెట్టి "నా నోరంటే ముప్పిపాలిటి సంపను కున్నారా ఎప్పుడు బడితే అప్పుడు మూసుకోవటానికి. అయినా నా నోరు నా ఇష్టం. ఇలాతెరుచుకునే వుంటాను" అన్నాడు అటెండరు కితకితలుగా నవ్వుతూ.

"ఒరేయ్! ఉదయాన్నే నన్నెందుకురా యిలా ఇబ్బంది పెడతావు" గడ్డం పుచ్చుకుని బతిమాలాడు.

"పిల్లేదండి. పిల్లేదు కాక పిల్లేదు. కావాలంటే ఓ ఫైవ్ కొట్టండి. నోట్లో కిళ్ళీ పడితే నోరు దానంతట అదే మూతపడుతుంది" అన్నాడు అటెండరు.

"తిరుపతి క్షవరం మొదలయ్యిందా?" అంటూ నోటుతీసి అందించాడు వాడి నోరు టక్కున మూతపడింది.

అమ్మయ్య ఓ గండం గడిచింది అనుకుని హెడ్ కర్లుక్కు గోవిందం దగ్గరకు నడిచాడు మెల్లగా.

ఆయన కాళ్ళు తన్ని పెట్టి కుర్చీలో వెనక్కి వాలి గుర్రు పెడుదూ హాయిగా నిద్రపోతున్నాడు.

ఓరినీడి తప్పాదియ్యా! బ్యాలెన్స్ బాగానే పెట్టుకున్నాడు. అయినా పదకొండు గంటలయినా కాలేదు. అప్పుడే ఇంత నిద్రా? ఓ నిద్రాదేవీ! నువ్వు ఈ ప్రభుత్వ ముద్దు బిడ్డల్ని ఎంచక్కా వరించి వారిని ధన్యులను చేస్తున్నావు తల్లీ. ఎంతయినా నీ కృషి అమోఘం అనుకుని మెల్లగా అతన్ని కదిపాడు గట్టిగా పిలిస్తే ఉలిక్కిపడి జడుసుకుంటాడేమోనని.

అంతే! గోవిందం గుర్రు ఆపి గుర్రుగా చూసి నిద్రాభంగం కలిగించినందుకు కనకారావు మీద మూడో కాలు మీద లేచి పిచ్చి కుక్కలా అరవడం మొదలెట్టాడు. కంగుతిన్న కనకారావు కంగారుపడి సందిగ్ధంలో పడ్డాడు.

గోవిందం మరింత రెచ్చి పోవడంతో కనకారావు ఇక తిప్పలు తప్పవనుకుని బాధగా జేబులో నుండి ఓ కొత్త ఇరవై రూపాయిల నోటు తీసి గాలిలో అలా అలా తిప్పుతూ పెళపెళలాడించాడు. ఆ నోటును చూసిన గోవిందం నోరు టక్కున మూతపడి నాగస్వరం వింటున్న పాములా రెండుక్షణాలు నోటు వైపు చూసి, నోరూరి పెదాలునాక్కుని గబుక్కున లేచి గబగబా ఎదురుగా కుర్చీ తుడిచి "కూర్చోండి సార్. మీరు రావడంతో మా ఆఫీస్ పావనం అయింది. ఒరేయ్ అప్పిగా! సార్‌కు చల్లని మంచినీళ్ళు పట్రా" అని "చెప్పండి సార్ ఏమిటి పని. అంతా కులాసాయేనా! కుబేరులు కులాసా కాక మరేం వుంటుంది" అన్నాడు గోవిందం వినయంగా చేతులు కట్టుకుని.

కృష్ణుని వేలిలో చక్రం తిరుగుతున్నట్లు కనకారావు నోటును అలాగే గాలిలో ఆడిస్తూ మెల్లగా కుర్చీలో కూర్చున్నాడు.

"సార్! నిరుల దృష్టి నోకి నోటు రంగు మాసి పోతుందేమో? దాన్ని జేబులో వేస్తే మోక్షం కలుగుతుంది" ఇకిలిస్తూ అడిగాడు గోవిందం.

కనకారావు చిద్విలాసంగా నవ్వుతూ నోటును

●●●

# "ఒరేయ్! ఉదయాన్నే నన్నెందుకురా యిలా ఇబ్బంది పెడతావు"

●●●

మెల్లగా క్రింద జారవిడిచాడు.

గోవిందం సీటులో నుండి కుక్కలా ఉరికి దాన్ని అందుకుని కళ్ళకద్దుకుని "ధర్మప్రభువులు, లక్ష్మీదేవి వరపుత్రులు. మిమ్మల్ని మించిన ధాతలేడు" అని తెగ మెచ్చుకుని మళ్ళీ కూర్చున్నాడు.

"సరి సరి. ఇంతకు బాస్ వున్నారా?" అడిగాడు కనకారావు.

"ఉన్నారు. ఉన్నారు. వెళ్ళండెళ్ళండి. బాగా పెడతారినాళ" అన్నాడు గోవిందం నర్మగర్భంగా నవ్వుతూ.

"అయితే వాళ్ళావిడ నీళ్ళాడి వుంటుంది. అందుకే స్వీట్లు తెచ్చి వుంటారు" అంటూ గబగబా లోపల కెళ్ళి తల పట్టుకుని కూర్చున్న రంగారావును చూసి "నమస్కారాలు ఇంజినీర్ సార్" అన్నాడు కనకారావు నవ్వటానికి ప్రయత్నిస్తూ.

కనకారావును మరమర చూసిన రంగారావు "ఛీ నువ్వొత్తి పనికిమాలిన కాంట్రాక్టర్‌వు అనుకోలేదు. నవ్వాలని ప్రయత్నిస్తున్నావు కానీ నవ్వకు" కయ్ మన్నాడు.

"కారణం తెలియకుండా అలా తిడితే నాకెలా అర్థం అవుతుంది. విషయం చెబితే మీ తిట్లకు సార్థకత వుంటుందండి" వినయంగా చెప్పాడు కనకారావు చేతులు కట్టుకుని.

"దొంగ వినయం చూపకు. మొన్న నువ్వు వేయించిన రోడ్లు ఇంత వరకు పాడవలేదు. నువ్విలా మరీ స్ట్రాంగ్‌గా రోడ్లు వేయిస్తే నేనేంకావాలి? పైసా పై సంపాదన లేక ఇంట్లో కూడా లోకువయ్యాను. ఛీ హు" అని తలపట్టుకుని కూర్చున్నాడు.

"పెళ్ళాం కనలేదని ఏవడో ఏదో చేశాడట. వచ్చిన దాంట్లో సగం మీరే దొబ్బేశారు. మిగిలిన సగంలో సగం నేనుదొబ్బేసి ఆసగంతో రోడ్డు వేయించాను. అయినా మీ మొహం చూస్తుంటే టిఫిన్ కూడా తిన్న దాఖలాలు కనిపించడం లేదు. అప్పిగాడిని పిలవండి కమ్మని టిఫిన్ తెప్పిస్తాను హాయిగా తిని తీరిగ్గా మాట్లాడుకుందాం" అన్నాడు కనకారావు.

రంగారావు అంటెండర్ని పిలిచి కనకారావు చేత డబ్బులిప్పించి కావలసిన టిఫిన్స్ తెమ్మని చెప్పి అప్పుడు కనకారావును కూర్చోమన్నాడు.

"అమ్మయ్య. ఇప్పటికైనా కూర్చోనిచ్చారు. చాలా సంతోషం" అంటూ చతికిలబడ్డాడు కనకారావు.

"ఏం చేస్తావో నాకు తెలియదు. ఓ నెల రోజుల్లో కొత్త రోడ్లకు కాంట్రాక్టులు ఇప్పించాలి. నాకు డబ్బు చాలా అవసరం. పరిస్థితి ఇలాగే వుంటే నేను టిఫిను, కాఫీలు లేక బయట ఎంగిలాకులు నాక్కుంటూ కూర్చోవాల్సిందే" చిరచిరలాడాడు రంగారావు.

"మీ పరిస్థితి అర్థం అయ్యింది సార్. ఈరోజే విజృంభిస్తాను సార్. ఈ రాత్రికి నేనే స్వయంగా టెలిఫోన్ వైర్లన్ని కత్తిరించేస్తాను. కారణం తెలియని టెలిఫోన్ డిపార్ట్‌మెంట్ వాళ్ళు జుట్టుపీక్కుని రోడ్లని అడ్డదిడ్డంగా తవ్వి తవ్వి గుంటలు పెట్టేస్తారు అదీ సక్సెస్ కాకపోతే డ్రైనేజీ నిండా రాళ్ళు కొట్టించి ఈ ఊరంతా నీళ్ళు నిలిచిపోయేలా చేస్తాను. అప్పుడు మున్సిపాలిటీ వాళ్ళు విజృంభించి మిగతా రోడ్లని మంగళహారతి పాడిస్తారు. మొత్తం మీద మన ప్లాన్ సక్సెస్ అవుతుంది. రోడ్లన్నీ మనుషులు కూడా నడవలేకుండా తయారవుతాయి. అప్పుడు నేనే ఓ పదిమందిని కూడగట్టుకుని మీ ఆఫీస్ ముందు టెంట్ వేసి ధర్నాలు జరిపించి రోడ్లు బాగు చేయించమని నిరాహార దీక్ష చేయిస్తాను. అప్పుడు మీరుదిగి వచ్చి టెలిఫోన్ డిపార్ట్‌మెంట్ వాళ్ళమీద, మున్సిపాలిటీ వాళ్ళమీద ఉత్తిత్తిగా కేసు పెట్టినట్లుగా పేపరు స్టేట్‌మెంట్ యిచ్చి ఆనక టెండర్లు పిలిచి అందులో నా టెండరుకే వర్కు అప్పగించి అప్పనంగా వచ్చిన డబ్బుతో ఆనందంగా మీ ఆవిడకు బంగారు నగలు చేయించి యిస్తారన్నమాట" చెప్పాడు కనకారావు గుక్క తిప్పుకోకుండా.

"అమ్మో అమ్మో కాంట్రాక్టరువంటే నువ్వే. నిజంగా నీ మెదడంతా కాంట్రాక్టురు ఆలోచనలు గులగుల మంటున్నాయి. త్వరలో మన రాష్ట్రంలోనే ఖర్మ ఖర్మ మన రాష్ట్రం ఏమిటి మన దేశంలోనే ఓ పెద్ద కాంట్రాక్టర్‌ని అవ్వాలని నా కోరిక, ఆశీస్సులో" అంటూ రంగారావు కాలిక్యులేటర్ తీసుకుని ఇవ్వబోయే కాంట్రాక్టు తాలుకు కమీషన్ లెక్కలు వేసుకుంటున్నాడు.

●